కథ

# మధురమ్.. మధురమ్..

పేరి జ్యోతిరాదిత్య

**తనేమిటిలా అతడిని పూలతలా పెనవేసుకుంటోంది. జ్వరం వచ్చినట్టు వళ్లంతా వేడెక్కుతోంది. సన్నటి వణకు.. గుండెలు ఎగసి పడుతున్నాయి. అతని బలమైన బాహువుల మధ్య తను నలిగిపోతోంది. ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతోంది. వద్దు వద్దు అనుకుంటూనే అతడిని తను మరింత గట్టిగా హత్తుకుంది. ఇది తప్పు.. పెళ్లికాని తను ఇలా చేయకూడదని మనసు హెచ్చరిస్తున్నా శరీరం వినడం లేదు. అధరాలు కలుసుకున్నాయి. ఏవో మధురాలు తనలోకి ఇంకుతున్నాయి. తననలాగే ఎత్తుకుని అతను బెడ్‌మీదకు చేర్చాడు. తనపై ఒరుగుతున్నాడు. వద్దని.. కావాలని.. వద్దని..కావాలని... మనసు శరీరం.. ద్వైదీభావం.. కావాలనే కోరికే నెగ్గింది..**

''హలో గుడ్మాణింగ్.. శుభోదయం.. లేమ్మా తల్లీ.. లేవరా కన్నా..''

సెల్‌ఫోన్‌లో రికార్డ్ చేసిన ఆ స్వరం అలారంగా మోగి మధురను కలలోంచి మెలకువలోకి తీసుకొచ్చింది..

చటుక్కున లేచి మోగుతున్న సెల్ వైపు చూసింది మధుర. గది నిండా పరచుకున్న చీకటిలో సెల్ కాంతి పల్చగా ఆమె మొహం వరకూ వెలుగునిచ్చింది.

చిన్నగా తనలో తాను నవ్వుకుని మంచం దిగింది మధుర.

ఎప్పుడూ లేనిది.. ఈ ఉదయం ఎందుకో ఏవో ఆశలు మనసులో దోబూచులాడుతున్నట్టు... అవే పెదవులపై నవ్వులయినట్టు అనిపించిందామెకా క్షణంలో.

గబగబా ముఖం కడుక్కుని ట్రాక్‌సూట్ తీసి వేసుకుంది మధుర. ఫుల్ స్లీవ్స్‌తో, ఒంటికి అతుక్కున్నట్టున్న ఆ సూట్... ఎవరో దగ్గరగా హత్తుకున్నంత వెచ్చదనాన్నిచ్చింది ఆమెకి. భుజాలు దాటని జుట్టుని బ్యాండ్ పెట్టి పోనీగా కట్టేసినా, ఇంకా ముంగురులు ముఖాన్ని ముద్దాడాలన్నట్టు ముందు ముందుకు పడుతూ ఉంటే.. ఎందుకో మరోసారి చిరునవ్వొకటి విరిసింది మధుర అధరాలపై. నుదిటి పైన హెడ్‌బ్యాండ్ పెట్టి వాటిని కొంతలో కొంత అదుపు చేసింది. పెదవులకు పల్చగా లిప్‌బామ్ రాసుకుని, కాళ్లకు షూ లేసులు కట్టుకుని తలుపు తీసేసరికి చలిగాలి రివ్వున మొహాన్ని తాకింది. బైటికొచ్చి హ్యాండిల్ వదిలేస్తే, డోర్ దానంతటదే లాకయిపోయింది తన వెనగ్గా.

రోజూ కన్నా ఇవ్వాళ ఎలాగైనా మరో రెండు కిలోమీటర్లు ఎక్కువ పరుగెత్తాలి.. ఇంకో నెలరోజులకల్లా బరువు మూడు కిలోలు తగ్గితే.. తను సరిగ్గా యాభై కిలోలు. ప్రపంచ అందగత్తెల కొలతల్లో ఓ వైజాగమ్మాయి! అందాల పోటీల్లో పాల్గొనకపోయినా విశ్వసుందరి కిరీటం సొంతమయినంత ఆనందంగా అనిపించిందా ఊహ మధురకి. అది ఇచ్చిన ఆనందంతో యూ ఆరే బ్యూటిఫుల్ గాళ్... రెడీ.. స్టార్ట్.. అని తనన్తానే ఉత్సాహపరుచుకుని పరుగు మొదలెట్టింది.

మార్గశిర మాసం... రాత్రి వెలిగిన పున్నమి చంద్రుడు అప్పటికింకా వెలిసిపోలేదు.. పైగా ఇప్పటికింకా నా వయసు నిండా పదహారే.. అన్నట్టు వన్నెలతో ప్రకాశిస్తున్నాడు. ధనుర్మాసం ముగ్గుల్లో మిస్సయిన తళుకుల చుక్కలన్నీ ఆకాశంలోనే ఉన్నాయి. చలి పులితో పోటీ పడుతూ చిరుత పులిలా పరుగెడుతున్న మధురను చూసి సముద్రపు కెరటాలు ఎగిరెగిరి పడుతున్నాయి. షూటింగ్‌లో అందమైన కొత్త హీరోయిన్ని చూసి వెర్రెక్కి ఈలలేస్తున్న కుర్రకారులా ఒకదాన్నొకటి తోసుకుంటూ విరగబడుతున్నాయి. ఇరవైరెండేళ్ల వయసు తెచ్చిన అందంతో.. విరబూసిన ముద్దబంతి పూల చెట్టులా ఉన్న ఆ అమ్మాయిని చూడ్డానికే తలలు వంచి వెలుగుతున్నట్టున్నాయి స్ట్రీట్ లైట్లు. ఆర్కే బీచ్ దగ్గరే కాలనీలో ఇల్లు కనుక మధుర రోజూ ఆ రోడ్డమ్మటే పేవ్‌మెంట్ మీద దాదాపు ఎంవీపీ కాలనీ సర్కిల్ దాకా జాగింగ్ చేస్తుంది. ఇవాళ మరికొంత దూరం.. కైలాసగిరి రోడ్డు దాకా వెళ్లాలని ఆమె ఆలోచన.

మెరైన్ ఉన్న చోటు దాటి కొంత ముందుకొచ్చేసింది.

సరిగ్గా అక్కడే మధుర మదిలో అకస్మాత్తుగా ఓ ఆలోచన మెరుపులా మెరిసింది. అప్రయత్నంగా తల వంచి ఒక్కసారిగా తన ఎడమచేతి మణికట్టును చూసుకుంది.. ఎప్పుడూ ఉండాల్సిన ఫాస్ట్‌ట్రాక్ వాచీ లేదు! ఎక్కువ దూరం జాగ్ చెయ్యాలన్న తలపులో పడి, చేతికి వాచీ పెట్టుకోవడం మరిచిపోయింది.. అంతేకాదు.. బయల్దేరే ముందు టైం చూసుకోవడం కూడా!! మధుర పరుగులో వేగం ఎవరో కీ ఇచ్చినట్టు తగ్గింది.

చుట్టూ చూసింది.. చిక్కని చీకటి. పైకి చూస్తే చంద్రుడు, నక్షత్రాలు...ఎక్కడా సూర్యోదయం అవుతోందన్న దాఖలాలే లేవు. కెరటాల హోరు తప్ప మరే శబ్దమూ లేదు. తాను జాగ్ చేస్తున్న రోడ్డున మనుషుల అలికిడే లేదు. హోరున వీస్తున్న సముద్రపు గాలిలో కలిసిపోయి తన బూట్ల చప్పుడు సైతం తనకు వినిపించటం లేదు. రెండు కుక్కలు ఒకదాని వెనక ఒకటి తన పక్కనే పరుగున వెళ్లాయి.

ఒక్కసారిగా గొంతు తడారిపోయింది మధురకి. కొద్దికొద్దిగా భయం పాములా పాకి చెమటలు పట్టాయి ఆ అమ్మాయికి. వెనక్కి తిరిగి చూస్తే... వరుసగా నిలుచున్న అపార్ట్‌మెంట్లలో కామన్ లైట్లు చుక్కల్లా మెరుస్తున్నాయి.. మరికొద్ది దూరంలో.. డాల్ఫిన్స్ నోస్.. ఆపై వెలుగుతూ ఆరుతూ లైట్ హౌస్.

ఇదేమిటి.. ఎన్ని గంటలకు నిద్ర లేచింది తను? ఐదింటిక్కాదా? అర్ధరాత్రి అంకమ్మ శివాలని సామెత చెప్పినట్టు.. కొంపదీసి అర్ధరాత్రి ఏ ఒంటి గంటకో లేచి జాగింగ్ చేసెయ్యట్లేదు కదా తను? రోజూ ఐదింటికి లేచి, రెడీ అయి రోడ్డు మీదకొచ్చేసరికి ఐదున్నర. ఆపాటికి పాలవేన్లు, న్యూస్‌పేపర్ వాహనాలు, ఉదయం ఆరున్నర షిఫ్ట్‌కెళ్లే ఉద్యోగస్తులు.. తనలాగా జాగింగ్‌కో, నడక్కో వచ్చేవాళ్లు.. అడపాదడపా కనిపిస్తూనే ఉంటారు. ఇవాళ అత్యుత్సాహంలో పడి తను గమనించలేదు గానీ ఇప్పటి వరకూ రోడ్డంట ఒక్క వాహనం వెళ్లలేదు.. మరో మనిషి జాడలేదు. ఆపాటికుండాల్సిన సంచారం... అసలే లేదు.

ఒక్కసారి ఒళ్లు ఝల్లుమంది మధురకి. సముద్రంలో పడి ఆత్మహత్యలు చేసుకుని చనిపోయినవాళ్లంతా దెయ్యాలవుతారా... అటువంటివి ఈ రోడ్డు మీదే తిరుగుతుంటాయి కదా.. ఒంటరి ఆడపిల్ల కనిపిస్తే కొబ్బరిముక్కలా నంజుకోవూ..! అబ్బో... ఒక్కసారిగా మధురలోని ధైర్యమంతా దిగజారిపోయింది. చెమటలో తడిసి ముద్దయిపోయింది.

తను రోజూ కన్నా ముందు లేచొచ్చేసిందనడంలో సందేహమే లేదు. ఇంతకీ ఇప్పుడు టైమెంతయింది? తెల్లవారడానికింకా ఎంత సమయముంది? ఇప్పుడేమిటి చెయ్యడం? వెనక్కి తిరిగి ఇంటికెళ్లిపోనా... సగం కన్నా ఎక్కువ దూరమే వచ్చేసింది తను. ఇటు సర్కిల్ వైపు వెళ్లడమే మంచిది. నలుగురు మనుషులుండొచ్చు.. ఘళ్లీ ఈ నిర్మానుష్యమైన రోడ్డు మీద పరిగెడుతూ ఇంటికెలా వెళ్లడం? పోనీ వెళ్లిపోదాం... ఆలోచిస్తుంటే ఒక్కసారిగా తాను చూసిన సినిమాల్లోని భయంకర దృశ్యాలన్నీ మధుర కళ్లముందు రీళ్లలా తిరిగాయి. ఇప్పుడు ఏ

రౌడీ వెధవలో తనను అటకాయిస్తే..! దూరంగా ఎత్తుకెళ్లి ఏమైనా చేస్తే..!! ఇప్పుడెలారా దేవుడా.. నాలాగా ఒక్కరన్నా ముందు లేచి తయారయి రాకూడదా.. ఛ. టైమడగాలన్నా ఎవ్వరూ లేరు. ఎవ్వరైనా... ఒక్కరంటే ఒక్కరు కనిపించకూడదా..

మధుర మనసులో ఆలోచిస్తూ ఇహలోకంలో కొచ్చేసరికి.. తాను పరిగెత్తడం మాట అటుంచి, నెమ్మదిగా పెళ్లి నడక నడుస్తోన్నట్టు గమనించింది. ఎవరైనా చూసి, మరో తరహాలో వేరే ఏదైనా అనుకుంటే కష్టమనుకుంది. ఆ ఆలోచన రావడంతో భయం ఇంకా ఎక్కువయ్యింది. జాగింగ్ వేగం పెంచింది.

దూరంగా ల్యాంప్ పోస్ట్ వెలుతురు.. ఆ వెలుతురులో మనిషి ఉన్నట్టు అస్పష్టంగా తెలుస్తోంది..


ఒక్క క్షణం మధురకి బలం వచ్చేసింది. అక్కడెవరో ఉన్నారు. ఇంకేం ఫర్లేదు. ముందెళ్లి టైమెంతయింతో అడగాలి..

మరుక్షణమే మధుర సత్తువంతా పేరు తెలియని రాక్షసుడెవరో లాగేసినట్లయిపోయింది. అతను మంచివాడే అయి ఉంటాడని గ్యారెంటీ ఏమిటి? ఒక్కరేనా... ముగ్గురు నలుగురుంటే..? అసలిది అర్ధరాత్రో, ఉదయమో తెలియడం లేదు.. వాళ్లే మద్యం మత్తులోనో ఉంటే..? తనని అల్లరి పెడితే.. రకరకాల ఊహలు ఆ అమ్మాయిని అడుగు ముందుకెయ్యాలో వద్దో తేల్చుకోనివ్వలేదు.

ఏమయితే అదే అయింది.. అన్నీ చెడు ఆలోచనలే ఎందుకు చెయ్యాలి.. ఏమో ఎవరైనా పెద్దమనిషి ఉండొచ్చు.. లేదూ, తనలాగే ముందొచ్చేసిన అమ్మాయో, నడివయసు మహిళో ఎందుకుండకూడదు.. అంతగా ఒక్కరే మగమనిషి ఉంటే తను పలకరించకుండా ముందుకెళ్లిపోతే సరి.

పరుగు వల్లో, భయం వల్లో తెలియని చెమటను తుడుచుకుని మధుర అటుగా అడుగులేసింది.. ఆ ఆకారం కాస్తకాస్త స్పష్టంగా కనిపిస్తోంది.. నోటివద్ద నక్షత్రంలా ఎర్రటి వెలుగు. సిగరెట్ తాగుతున్నట్టున్నాడు. అతని కాళ్ల వద్ద లైటు వెలుగులో ఏదో తళతళ లాడుతోంది.

జాగ్రత్తగా చూసింది మధుర. పగిలిన బీరు సీసా ముక్కలు. ఒక్కసారిగా గుండె ఆగినట్టనిపించింది. అతని బీరు తాగి సిగరెట్ తాగుతున్నాడా.. బీరు వ రా త్ర వే ం తాగాడా.., లేదా విస్కీ, బ్రాందీల్లాంటివి కూడా తాగాడా.. అతనిప్పుడు మత్తులో ఉన్నాడేమో.. తనను చూస్తే.. చూసాక ఊరకుంటాడా? ఈ చలి వేళలో ఏదన్నా.. అలాఅనుకో గానే



మధుర శరీరం అంతటి చలిలోనూ చెమటతో తడిసి పోయింది. అడుగులు ఆగిపోయాయి.. అప్పటికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. తను అతనికి కేవలం పది అడుగుల దూరంలో ఉంది.. అడుగులు అయస్కాంతానికి అతుక్కున్నట్టు నేలకు పాతుకు పోయాయి...

ఏం చెయ్యాలి.. అనుకుంటున్నంతలోనే

''హలో ఎక్స్‌క్యూజ్ మీ... గుడ్మాణింగ్..'' అన్న మాట వినిపించింది.

ధైర్యాన్ని కూడదీసుకుంటూ, వద్దనుకుంటూనే ఓరకంట చూసింది మధుర.

ల్యాంప్ పోస్ట్ వెలుగులో.. తన ముందు నిల్చున్న వ్యక్తి రూపురేఖలు స్పష్టంగా కనిపించలేదామెకు. ఓ సిలవెట్ మాత్రం తనకన్నా అవతలి మనిషి ఓ అడుగు పొడవున్నట్టు, జాగింగ్ సూట్లో ఉన్నట్టు పట్టించింది. యువకుడేనేమో అని కూడా అనిపించింది.

లోపలి అనుమానాలేమీ తొణికి బైటికి కనిపించకుండా ఉండటానికి ప్రయత్నం చేస్తూ ''యస్.. గుడ్మాణింగ్..'' అంది.

అని అడుగు ముందుకెయ్యబోతుంటే.. ''ఆగండి'' అని వినిపించింది.

''నేను వాచీ మరచిపోయాను.. టైమెంతయిందో తెలియటం లేదు.. అర్ధరాత్రి లేచొచ్చేశానా అని అనుమానంగా ఉంది. రోజూ నాతోపాటు మా తమ్ముడూ వస్తాడు జాగింగ్‌కి. ఇవాళ రాలేదు. ఒక్కణ్ణే వెళ్లాలంటే ఏదోలా ఉంది.. నేనూ రానా మీతోపాటు..? నేను కాస్త కైలాసగిరి మలుపు దాటి వెళ్దామనుకుంటున్నాను.. మీకభ్యంతరం లేకపోతేనే... అన్నట్టు టైమెంతయింది...'' ఒక్క గుక్కలో మొత్తం చెప్పేశాడతను.

అప్పటి వరకూ ఆమెలో ఉన్న భయం కాస్త తగ్గింది.

వీడెలాంటివాడో.. తన దగ్గరా వాచీ లేదని ఎందుకు చెప్పడం... అసలు మాట కలపకుండా ఉంటే సరి.. అనుకుని మధుర సీరియస్గా మొహం పెట్టి బింకంగా ''రండి.. '' అని మాత్రం అంది.

''థాంక్సండీ.. '' అంటూ చివరికంటా కాలిన తన చేతిలోని సిగరెట్‌ను పడేసి ఆమెను అనుసరించాడు.

వీధి దీపాల వెలుగునీడలు.

కొంత దూరం జాగ్ చేస్తూనే.. ''నా పేరు మార్తాండ. మీ పేరు తెలుసుకోవచ్చా నేను.. '' అన్నాడతను.

అతని నోటినుంచి మద్యం వాసనరావడం లేదు.. హమ్మయ్య ఇతను తాగలేదు అనుకుంది మధుర. అలా అనుకోగానే ఆమెలో భయంపూర్తిగా పోయింది..

చెప్పాలా వద్దా.. చెబితే ఇంకెన్ని ప్రశ్నలడుగుతాడో.. తర్వాత మీ ఇల్లెక్కడ అంటాడు.. బరువెక్కువ లేనట్టున్నారుగదా.. ఎందుకీ జాగింగ్ అనే వరకూ వెళ్లిపోతాడేమో.. అనుకుని వద్దనుకుంటూనే.. ఓరకంట చూస్తూనే.. ''నా పేరు మధుర'' అని చెప్పింది.

''ఓహ్.. నైస్ నేమ్.. మధుర.. మీది మధుర వాడా ?.'' అని చిన్నగా కొంటెగా నవ్వాడతను.

ఒక్కసారి చివుక్కున తలతిప్పి చూసింది. ఆ చీకట్లో ఆమె మొహంలోని కోపపు ఛాయలెంత కనిపించాయో తెలీదుగానీ, అతను కొద్దిసేపు మరేమీ మాట్లాడలేదు.

పరుగు క్రమంగా నెమ్మది చేస్తూ.. ''అక్కడేదో టీ దుకాణం ఉన్నట్టుంది.. టీ తాగుదామా.. మీరేమీ అనుకోనంటేనే.. '' అన్నాడతను.

అతను చెప్పిన వైపు చూసిన మధురకు మనసుకు ఒక్కసారిగా ధైర్యం చిక్కింది. అక్కడో టీ దుకాణం. కనీసం మరో ఇద్దరు మనుషులయినా ఉంటారనే భరోసా కలిగిందామెలో. అందుకే సరేనంటూ అడుగులేసింది.

వేడిగా పొగలు కక్కుతున్న టీ.. ఓ ట్యూబ్‌లైట్.. కానీ పదిహేనేళ్ల కుర్రాడు తప్ప మరెవరూ లేరక్కడ. ఊదుకుంటూ తాగుతున్నప్పుడు మార్తాండను పరిశీలనగా చూసింది. తనకన్నా నాలుగైదేళ్లు పెద్దవాడయి ఉంటాడంతే. పచ్చటి రంగు మనిషి. చక్కని క్రాఫ్, నీట్‌గా షేవ్ చేసిన గడ్డం.. చెంపలు కాస్త ఆకుపచ్చగా, నీలంగా.. ఎంత బాగున్నాడో. ఈమధ్యనొస్తున్న కుర్రహీరోల్లా శరీరం కడ్డీలా ఉంది. తనలాంటిది కాకుండా పల్చటి ట్రాక్‌సూట్ వేసుకోవడం వల్ల వీటన్నిటినీ గమనించి.. సిక్స్ ప్యాక్ కోసం ప్రయత్నిస్తున్నాడు గురుడు.. మొత్తానికి భలే బావున్నాడు.. అనుకుంటూ మనసులో పదికి ఎనిమిది మార్కులేసేసింది మధుర.

''టీ అయిపోయింది.. బయల్దేరదామా.. ఇంకా చాలా దూరం వెళ్లాలి మనం.. '' అన్నాడతను డబ్బులిస్తూ. నేనిస్తాను.. అందామనుకుందిగానీ, తన దగ్గర పైసా లేనందుకు సిగ్గుపడుతూ ''పదండి'' అందా అమ్మాయి.

కలిసి పరిగెడుతుంటే అంతకు ముందెన్నడూ లేని అవ్యక్తమైన భావాలేవో తనలో కలుగుతున్నట్టు పసిగట్టింది. మల్లెమొగ్గ ఒకొక్క రేకే నెమ్మదిగా విడుతున్నట్టు.. పున్నమి చంద్రుణ్ణి రాసుకుంటూ ఒక్కో మేఘమే దాటిపోతున్నట్టు.. ఇదీ అని తెలియని వివశత్వంలో ఎంత దూరమొచ్చేశారో కూడా గమనించడం మరిచిపోయిందామె.

ఇక వెనక్కెళ్లిపోదామా.. అంటూ అతను వెనక్కి తిరగడంలో ఆ యువకుడి చెయ్యి తగిలింది మధుర చేతికి. ఒక్కసారి ఏదో మెరుపు శరీరాన్ని చుట్టినట్టనిపించిందా యువతికి. ఓరకంట కూడా తల తిప్పి చూడలేకపోయింది. అప్పుడే బంగారు రంగు భానుడు సముద్రంలోంచి పుట్టినట్టు పెద్ద బంతిలాగా పైకొస్తున్నాడు.. చీకటి పోలేదు గానీ, దూరంగా తూర్పుదిక్కంతా ఎర్రబడుతోంది.. అతనూ అటువైపే చూస్తున్నాడనుకుంది మధుర.. చూస్తే అతను నెమ్మదిగా చెయ్యి జరిపి తన వేళ్లలోనికి తన వేళ్లు ముడివేశాడు.. ఎందుకో వద్దనలేకపోతోందా అమ్మాయి..! ఒక్కసారిగా రెండో చేత్తో మధుర నడుమును చుట్టేసి.. వేడి ఊపిరి తగిలేంత దగ్గరగా మొహంలో మొహం పెట్టి చూశాడు.. మధుర ఒక్కసారి తల పైకెత్తి చూసి రెప్పలు భరించలేనంత బరువుగా అయిపోయినట్టనిపించి చూపు కిందికి దించేసింది.. కళ్లు మూతలు పడిపోతున్నట్టనిపించింది.. చిలక ముక్కుల్లా తమ నాసికాగ్రాలు రాసుకుంటుంటే.. ఇద్దరి ఊపిరీ కలిసి ఒక పొగలాగా వెలువడుతుంటే.. అత ను తన పెదవులు అందుకోవడానికి మరింత ముందుకి వంగుతుంటే.. ఇతని చేతుల్లో తానెందుకు పంచదార పాకంగా కరిగినట్టు కరిగిపోతోందో మధురకు తెలియక పోతోంటే...

అప్పుడా యువతి తలకు ఫట్‌మంటూ తగిలిందో దెబ్బ!

అమ్మా.. అంటూ అరిచింది మధుర..దబ్బుమని కిందపడింది..

***

కళ్లు తెరచి, లేచి చుట్టూ చూస్తే.. మంచం మీద తను.

చుట్టూ చిమ్మ చీకటి..

''అమ్మా.. లే అమ్మా.. లేవరా కన్నా..''

ఇదేమిటి అమ్మ గొంతు...! ఎక్కణ్నుంచి....!!

సెల్‌ఫోన్‌లో రికార్డ్ చేసిన ఆ స్వరం అలారంగా మోగి మధురను కలలోంచి మెలకువలోకి తీసుకొచ్చింది..

చటుక్కున లేచి మధుర మోగుతున్న సెల్ వైపు చూసింది. గది నిండా పరచుకున్న చీకటిలో సెల్ కాంతి పల్చగా మధుర మొహం వరకూ వెలుగునిచ్చింది.

చిన్నగా తనలో తాను నవ్వుకుని మంచం దిగింది మధుర.

ఎప్పుడూ లేనిది.. ఈ ఉదయం ఎందుకో ఏవో ఆశలు మనసులో దోబూచులాడుతున్నట్టు... అవే పెదవులపై నవ్వులయినట్టు అనిపించిందామెకా క్షణంలో.

*


చిరునామా :

**పేరి జ్యోతిరాదిత్య,**

**# 403; వీ.ఆర్.ఎన్ ప్లాజా,**

**మల్కాజ్‌గిరి, హైదరాబాద్ – 47**